ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 12 మే 2025 | 5



కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(ఆదివారం)
కనిష్ఠం : 29



ఊరేగిన సత్యదేవుడు

అన్నవరంలో గత మూడు రోజులుగా కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం సత్యదేవుడి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.. రథంపై ఊరేగుతున్న రత్నగిరివాసుడిని చూసి తరించేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు.. దీంతో ఎటు చూసినా భక్తజనమే.. ఓం నమో సత్యదేవాయ నామస్మరణతో కొండంతా మారుమోగిపోయింది.. సత్యదేవుడు.. అనంతలక్ష్మి కొలువై ఉన్న రథాన్ని లాగేందుకు భక్తజనం పోటీపడ్డారు..

- వివరాలు 7లో

సూపర్..6



ఎదురుచూపులు ఫలించాయి..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరుగురు నాయకులను నామినేటెడ్ పదవులు వరించాయి. దీంతో ఇప్పటి వరకూ నామినేటెడ్ పదవులపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కేఎస్ జవహర్ నియమితులయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును వరించింది. రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ చైర్మన్ పదవి మండపేటకు చెందిన జనసేన నాయకుడు వేగుళ్ల లీలాకృష్ణను వరించింది. ఇక రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి రంపచోడవరానికి చెందిన చోళ్ల బొజ్జిరెడ్డి (బీజేపీ) నియమితులయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరి ంచింది. తుమ్మల బాబు ప్రస్తుతం కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఉన్నారు. తాజా పదవితో తుమ్మలకు మూడు పదవులు వరించినట్లయింది.అటు డీసీఎంస్ చైర్మన్‌గా కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పెచ్చెట్టి చంద్రమౌళికి కేటాయించారు. ఒకేసారి ఆరు పదవులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించడంతో సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలో పదవుల పండగ

- ఉమ్మడి జిల్లాకు ఒకేసారి ఆరు పదవులు
- నామినేటెడ్ పదవులు పంపకం
- రాష్ట్రస్థాయి చైర్మన్లుగా నలుగురు
- డీసీసీబీ, డీసీఎంఎస్‌కు ఇద్దరు
- ఎట్టకేలకు వీడిన ఉత్కంఠ
- ఫలించిన ఎదురుచూపులు
- టీడీపీకి 3, జనసేనకు 2, బీజేపీకి 1

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్

కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కేఎస్ జవహర్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్ అనూహ్యంగా 2014లో కొవ్వూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014 నుంచి 2019 వరకు కొవ్వూరు ఎమ్మెల్యేగా, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేశారు.తదనంతర పరిణామాలతో కొవ్వూరు నుంచి తిరువూరు వెళ్లా రు.2019లో తిరువూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి ఎమ్మెల్యే సీటు ఆశించినా దక్క లేదు.దీంతో పోటీకి దూరంగా ఉన్నారు. ప్రసుత్తం తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జవహర్ తనయుడు కొత్తపల్లి లాల్ టీడీపీ యువజన విభాగం కార్యదర్శిగా,రాజానగరం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు.ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

సమసమాజ స్థాపనకు కృషి

సామాజిక న్యాయం అందించడానికి.. సమసమాజ స్థాపనకు కృషి చేస్తా. పీ4 విధానంలో దళితుల అభివృద్ధికి సాధ్యమవుతుందని ఆశిస్తున్నా. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్‌లకు కృతజ్ఞతలు.

- జవహర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్‌గా శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావుకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) చైర్మన్‌గా పదవి లభించింది. ప్రభుత్వం ఆదివారం వివిధ కార్పొరేషన్లకు ప్రకటించిన పదవుల్లో శేషారావుకు ఈ పదవి దక్కింది. ఈయన 1965వ సంవత్సరం జూలై 15న వేలివెన్నులో జన్మించారు. బీఏ చదివారు. తొలుత టీడీపీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 1995లో వేలివెన్ను ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటి సర్పంచ్ ఆరేపల్లి వెంకట్రావు పదవిలో ఉండగా మరణించడంతో శేషారావు ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా కొనసాగారు. 2000 నుంచి 2009 వరకు సర్పంచ్ పదవికి జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు విజయం సాధించి గ్రామాభివృద్ధికి కృషి చేసారు. 2009లో సర్పంచ్‌గా పదవిలో ఉండగా నిడదవోలు నియోజకవర్గం కొత్తగా ఏర్పడింది. నాడు తొలిసారి నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధిం చి శాసనసభలో అడుగుపెట్టారు. రెండోసారి 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మూడో సారి ఓటమి చెందారు.అప్పటి నుంచి నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఈ పదవి రావడం పట్ల నియోజవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు శేషారావుకు అభినందనలు తెలిపారు.

సంతోషంగా ఉంది..

పార్టీ ఇచ్చిన పదవిని అంకిత భావంతో నిర్వహిస్తా. ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ పదవి రావడం సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు , సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు.

- బూరుగుపల్లి శేషారావు, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్

ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగపరంగా జ్యుడీషియల్ అధికారాలు కలిగిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత చోళ్ల బొజ్జిరెడ్డిని కూటమి ప్రభుత్వం నియమించింది. అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం బోలగొండలో కొండరెడ్డి తెగకు చెందిన ఈయన గిరిజన సంక్షేమశాఖలో ఉపాధ్యాయుడిగా తన కెరీర్ ప్రారంభించారు.ఆర్ఎస్ఎస్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామాచేసి 2009 ఎన్నికల్లో బీజేపీ తరపున రంపచోడవరం నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేశారు.అనంతరం బీజేపీలో కీలకంగా ఉంటూ ప్రస్తుతం అల్లూజిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని బొజ్జిరెడ్డికి కేటాయించారు.

సమస్యలు పరిష్కరిస్తా..

గిరిజన హక్కుల పరిరక్షణకు పాటు పడతా.. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి సాగిస్తా.ఈ పదవిని అప్పగించి నందుకు ప్రధాని మోదీ , పురందేశ్వరి, సీఎం చంద్ర బాబుకు కృతజ్ఞతలు.

- చోళ్ల బొజ్జిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్

ఏపీఎస్ఐడీసీ చైర్మన్‌గా లీలాకృష్ణ

మండపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆశలు ఫలించాయి. ఎదురుచూపులకు ఫలితం దక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామానికి చెందిన మండపేట నియోజకవర్గ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది.వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఇంటర్ చదివారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.తొలుత కాంగ్రెస్‌లో ఉన్నారు. 1995-2004 వరకు వల్లూరు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు.రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా 2000 నుంచి 2007 వరకు,పీసీసీ కార్యదర్శిగా 2011 నుంచి 2014 వరకు, మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా 2009 నుంచి 2014 వరకు పనిచేశారు. 2015- 2019 వరకు మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2019లో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు.2019లో మండపేట నియో జకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా ఉన్నారు.ముందుగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర సాగు నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం నియమించింది.

సాగునీటి పారుదల అభివృద్ధికి కృషి

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లకు ప్రత్యేక ధన్యవాదాలు.నాపై ఎంతో నమ్మ కంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా.సాగునీరు సరఫరాపై దృష్టి పెడతా. సాగునీటి వ్యవస్థలో మార్పులు చేర్పులపై నిపుణులతో చర్చించి చర్యలు తీసుకుంటా .

- లీలాకృష్ణ, ఏపీఎస్ఐడీసీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్‌గా తుమ్మల బాబు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి జనసేన జిల్లా అధ్యక్షుడు, కౌడా చైర్మన్ అయిన తుమ్మల రామస్వామి (బాబు)ను వరించింది. తొలుత డీసీసీబీ చైర్మన్ పదవికి పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినిపించింది.ఆఖర్లో అనుహ్యంగా ఈయనకు పదవి దక్కలేదు. అయి తే ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్‌లాంటి పెద్ద పదవిని మర్రెడ్డి చేపట్టలేరనే వాదన ప్రధానంగా పార్టీ అధినేత వద్ద వ్యక్తమైందని సమాచారం.దీంతో మర్రెడ్డికి అవకాశం చేజారిపోయినట్లయిందని పలువురు జనసేన నేతలు విశ్లేషించారు. అదే సమయంలో కౌడా చైర్మన్ తుమ్మలబాబును పిలిపించి ప్రస్తు తం డీసీసీబీ వందల కోట్ల అప్పుల్లో ఉన్నందున దీన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన విషయాన్ని వివరించి ఈయన పేరును ఖాయం చేసినట్లయింది. ఇదిలాఉంటే తుమ్మలబాబుకు తాజా కుర్చీతో కలిపి మొత్తం మూడు పదవులు చేతిలో ఉండడంపై జనసేన వర్గాలే విస్తుపోతున్నాయి. త్వరలో కౌడా కు కొత్త నేతను ఎంపిక చేస్తారని సమా చారం.కౌడా చైర్మన్ కుర్చీ టీడీపీకి ఇవ్వవచ్చనే ప్రచారం ఇరుపార్టీల్లో వ్యక్తమవుతోంది.

బాధ్యతగా చేస్తా

ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తా. పార్టీ అధిష్టానం ఉంచిన గురుతర బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించగలననే నమ్మకం, విశ్వాసం ఉంది.

- తుమ్మల బాబు

డీసీఎంఎస్ చైర్మన్‌గా చంద్రమౌళి

అమలాపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెనుకబడి సామాజికవర్గానికి చెందిన ఆయన్ను ఈ పదవిలో నియమించడం ద్వారా కోనసీమ జిల్లాలోని బీసీ సామాజికవర్గానికి న్యాయం చేసినట్టయింది.చంద్రమౌళి 1964 ఆగస్టు 27న జన్మించారు. బీఏ చదివిన ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి గ్రామ, మండల, ఉమ్మడి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు పదవులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా బీసీసెల్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడు పర్యాయాలు, ఆ తరువాత రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా పలు పర్యాయాలు సేవలందించారు.అల్లవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కూడా మౌళి పనిచేసి టీడీపీ కి విశిష్ట సేవలందించారు. చంద్రమౌళికి బీసీ కోటాలో డీసీఎంఎస్ పదవిని కేటాయించడంతో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.ఉమ్మడి జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులతో పాటు మార్కెటింగ్ కార్యకలాపాల ద్వారా వారికి ఉన్నతమైన సేవలను అందించడమే లక్ష్యమని డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి వెల్లడించారు. డీసీఎంఎస్ ఆస్తుల పరిరక్షణ, రైతులకు సేవ అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

డీఐఈవో శారద

కాకినాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయని డీఐఈవో శారద తెలిపారు. ఈ నెల 20 వరకూ పరీక్షలు జరుగుతాయని, సజావుగా నిర్వహించేందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 21,541 మంది విద్యార్థులు హాజరుకానుండగా వారిలో మొదటి సంవత్సరం పరీక్షలకు 15,933మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 5608మంది హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ మొదటి సంవత్సరం పరీక్షలు.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటలవరకూ రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

రూ.143 కోట్లతో హాస్టళ్లలో మరమ్మతులు

సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా

కొత్తపేట, మే 11(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. కొత్తపేట మండలం పలివెల పెదపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్ల ఫలితంగానే సమాజంలో వెనుకబడిన తరగతుల వారు ఉన్నత స్థాయికి చేరారన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టామన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యాపథకాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు ప్రతి గురుకులంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో అమలాపురం,పి.గన్నవరం ఎమ్మెల్యేలు ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, సర్పంచ్ సాదే లక్ష్మి శ్రీనివాస్,జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, ఈతకోట రమేష్‌కుమార్, శిల్పి రాజకుమార్ వడయార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డోలా వీరాంజనేయులు, ఎమ్మెల్యే బండారు

ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం : ఎస్పీ

కాకినాడ క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధవాతావరణం నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్‌లలోని ముఖ్యమైన బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు మద్యం, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడం, శాంతి భద్రతలకు ముప్పుగామారే అసాంఘిక శక్తులను గుర్తించడమే ముఖ్యలక్ష్యంగా కొనసాగాయి. ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యముగా భద్రతా చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ తెలిపారు. తనిఖీల్లో కాకినాడ, పెద్దాపురం సబ్‌డివిజన్లలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

ఉదయం లేవడంతోనే ఒక టీ పడాల్సిందే.. లేదంటే తెల్లారదు.. ముఖంలో ఆ అలసట కనిపిస్తూనే ఉంటుంది.. ఒక చుక్క పడితే.. ఆ ఛాయ్ చమక్కులే చూడరా బాయ్ అని చిరంజీవి అన్నట్టు ఉంటుంది.. డిమాండ్ ఉండడంతో వీధికో టీ దుకాణం వెలసింది.. ఒక్క రాజమ హేంద్రవరంలోనే ప్రతి రోజూ సుమారు 6 లక్షల మంది టీ తాగుతున్నట్టు సమాచారం.. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లెక్కకు మిక్కిలి ఉంటుంది.. అయితే డిమాండ్‌కు తగినట్టు నకిలీ టీపొడి విచ్చల విడిగా వినియోగిస్తున్నారు. అయినా పట్టించుకునేవారే లేరు.



కల్తీ ఏంటీ
మార్కెట్‌లో నకిలీ టీపొడి

- విచ్చలవిడిగా అమ్మకాలు
- కేజీ రూ.200లు మాత్రమే
- చిరు టీస్టాల్స్‌లో వినియోగం
- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం
- కన్నెత్తి చూడని అధికారులు
- రాజమండ్రిలో 9 పాయింట్లు

రాజమహేంద్రవరం సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వ్యాపారం ఎక్కడ చేయగలరు.. ఎక్కడ ఎక్కువ అమ్మకాలు జరుగుతాయో అక్కడే..ఎందుకంటే అంతా సందట్లో సడేమియా.. ఏం చేసినా తిరుగుండదు..అడిగే దిక్కుండదు. తెలిసినా ఊకొడతారు..ఊరుకుంటారు..ప్రస్తుతం రాజమహేంద్రవరంలో అదే జరుగుతుంది. కల్తీ టీ పొడికి అడ్డాగా మారిపోయింది. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో ప్రధాన వాణిజ్య కేంద్రం రాజమహేంద్రవరం..నిత్యం కోట్లలో వ్యాపారలావాదేవీలు సాగుతాయి.కనీసం కన్నెత్తి చూసే వారే కరువయ్యారు. దీంతో నకిలీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది.



నకిలీ టీపొడి

ప్రధాన వాణిజ్య కేంద్రంలో ఇలా..

రాజమహేంద్రవరం హోల్‌సేల్ వ్యాపారానికి ప్రసిద్ధి.మార్కెట్‌పై వ్యాపారులకు చాలా నమ్మకం.ఇదే పెట్టుబడిగా కొంత మంది కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్‌లోకి దింపి పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుతం కల్తీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది. క్షణాల్లో తయారు చేసి ప్యాకింగ్ చేసి ఎటువంటి అనుమానం రాకుండా తరలించేస్తున్నారు.రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో మూడు, ఎస్వీజీ మార్కెట్‌లో 6 పాయింట్లలో కల్తీ టీ పొడి తయారు చేసి విక్రయిస్తున్నారు. కల్తీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతుంది. సాధారణంగా ఒరిజినల్ టీపొడి ప్యాకెట్ 250 గ్రాములు కొనాలంటే రూ.200 నుంచి రూ.260 మధ్య ఉంటుంది.కేజీ టీపొడి కోనాలంటే రూ.600 పైనే ఉంటుంది.కల్తీ టీపొడి రూ.150 నుంచి రూ.200 లోపే వస్తుంది. అంతే కాకుండా చిన్న రూ.5 ప్యాకెట్లు అధికంగా తయారు చేసి మార్కెట్‌లోకి దింపుతున్నారు.ప్రజలు నాణ్యత చూడకపోవడం కూడా కల్తీకి కారణం.కల్తీ టీపొడి నియంత్రణలో అధికారులు విఫలమవుతున్నారు.

కల్తీ టీపొడి తయారీ ఇలా

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి చింతపిక్కలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటు న్నారు. వాటిని ఎండబెట్టి టీ పోడి మాదిరిగా ఆడిస్తున్నారు.దానికి జీడీపప్పు పిక్క లోపల ఎర్రని చారతో ఉండే పొరను తీసుకుని దానిని పిండిలా ఆడిస్తున్నారు.అనంతరం ఫుడ్ కలర్స్ కలిపి ఈ మిశ్రమాన్ని చింతపిక్కల పౌడర్‌లో కలిపి వేడిచేసి గచ్చుపై ఆరబెట్టి ఆరిన తర్వాత టీ పొడి ప్యాకెట్లు తయారుచేస్తున్నారు. ఇందులో కలిపే ఫుడ్ కలర్స్, జీడిపిక్కల పొర కారణంగా జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది.ఈ టీ పొడితో కాచిన టీ తాగితే ఖచ్చితంగా జబ్బుపడతారు. ప్రస్తుతం ఈ కల్తీ టీ పొడి తయారీకి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉంది.గతంలో అనపర్తిలో తయారుచేస్తే అప్పటిలో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుం డా నకిలీ టీపొడి వ్యాపారం జోరుగా సాగుతోంది.

వీధికో దుకాణం..

టీస్టాల్స్‌కు కొదువలేదు.. ఉమ్మడి జిల్లాలో ఏ వీధిలో చూసినా ఏదో ఒక మూల టీస్టాల్ కనిపిస్తూనే ఉంటుంది.చాలా టీస్టాల్స్‌లో కల్తీ టీ పొడి వినియోగిస్తున్నారు.ఈ టీ పొడికి కాస్త అల్లం, యాలకుల పొడి తగిలించి సువాసనతో అందించేస్తున్నారు.మంచి రంగు కనిపించడంతో అది కల్తీ అనే సంగతే అంతుపట్టడంలేదు. అప్పుడప్పుడు సంబంధిత అధికారులు,ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దాడులు చేసి ఫైన్ వేసినా పెద్దగా పట్టించుకోవడంలేదు. ఫైన్‌లు కట్టేసి నెమ్మదిగా మళ్లీ కల్తీ టీపొడి తయారు చేసుకుని ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.కల్తీ టీపొడి పట్టుకున్నప్పుడు వారి వ్యాపార లైసెన్సులు రద్దుతో పాటు వారిపై చట్టప్రకారం కఠిన శిక్షలు లేకపోవడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు స్పందించి నిఘా పెడితే కల్తీ వ్యాపారాలకు చెక్ పడే అవకాశం ఉంది.

అశేష భక్తజనమయం...
సత్యదేవుని రథోత్సవం


రథోత్సవ సేవను ప్రారంభిస్తున్న ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్


రథోత్సవంలో భక్తులు

అన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల్లో నిర్వహించే గ్రామసేవల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండుగగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను రూ.1.20 కోట్లతో తయారుచేయించిన నూతన టేకురథంపై ఆశీనులు గావించారు. ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు టెంకాయి కొట్టి రథోత్సవం ప్రారంభించారు. రథానికి కుంభం పోసి ముందుకు కదిలించారు. తొలిపావంచా వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆంధ్రాబ్యాంక్ వరకు వెళ్లి అక్కడ నుంచి సత్యదేవుడి కొండపైకి వెళ్లే టోల్ గేట్ వరకు కొనసాగి తిరిగి కాంప్లెక్స్ వద్ద నూతనంగా ప్రారంభించిన రథశాల వద్ద ముగిసింది. అశేష భక్తజనంతో అన్నవరం మెయిన్‌రోడ్డు జనసందోహాన్ని తలపించింది. దేవస్థానం ఉద్యోగులు యావన్మంది రథోత్సవంలో పాల్గొనాలని ఈవో ఆదేశాలు జారీచేయడంతో ప్రతిఒక్క ఉద్యోగి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 3500 కిలోల బరువుతో సుమారు 35 అడుగులుపొడవు కలిగిన ఈ రథం లాగేందుకు సుమారు 50 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, నాయీబ్రాహ్మణులు 50మందితో పాటుగా ముందుభాగంలో ట్రాక్టర్, వెనకభాగంలో జెసీబీ సాయంతో ఇబ్బంది లేకుండా ముందుకు కదిలించారు. ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు మైక్ ద్వారా సూచనలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు పర్యవేక్షణలో సుమారు 50మంది బందోబస్తు నిర్వహించారు.

నయనానందకరంగా వనవిహారం

సత్యదేవుడి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం వనవిహార మహోత్సవం నయనానందకరంగా జరిగింది. నవదంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి పల్లకీలో కొండదిగువున ఉన్న ఉద్యానవనానికి తీసుకుకొచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెండి సింహాసనంపై నవదంపతులను, మరో వేదికపై పెళ్లి పెద్దలైన సీతారాములను ఆశీనులు గావించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చతు ర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం కొండపైకి తీసుకెళ్లారు.


సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి
నక్షత్ర మాల విరమణ


పూర్ణాహుతి నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసకిరణ్

అంతర్వేది, మే 11(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన స్వయంభు కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి నక్షత్ర మాల విరమణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఏప్రిల్ 13, 14 తేదీల్లో స్వామివారి మాల ధారణ చేసిన భక్తులు 27 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షచేసి నృసింహస్వామి జయంతిరోజు గరుడముడిని శిరస్సున ధరించి ఆలయానికి వచ్చి సమర్పించారు. ఉదయం 8 గంటల నుంచి నక్షత్ర మాల దీక్షాధారులతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, ఆలయ స్థానాచార్యుల వి.రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకుడు జి.రాజేష్ ఆధ్వర్యంలో విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. దీక్షాధారులతో ప్రత్యేక పూజలు చేయించి దీక్ష విరమణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దీక్ష ధరించిన స్వాములతో కలిసి ఆలయ కల్యాణ మండప షెడ్డులో ఏర్పాటుచేసిన మహాశాంతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు హోమంలో పూర్ణాహుతి నిర్వహించి భక్తులందరితో హోమ ద్రవ్యాలను హోమగుండంలో వేయించారు.


స్వామివారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న స్వాములు, అర్చకులు, అధికారులు

ఘనంగా నృసింహ జయంతి

సాయం సంధ్యవేళలో పుట్టిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి రోజూ ఉదయం అభిషేకం, హోమం, మాఘమాసంలో కల్యాణం నిర్వహిస్తారు. ఒక నృసింహ జయంతి రోజున మాత్రమే సాయంత్రం 6 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు అర్చకుల ఆధ్వర్యంలో జరుగుతాయి. స్వామివారి నిజ రూప దర్శనం ఉదయం, సాయంత్రం నృసింహ జయంతి రోజున మాత్రమే భక్తులకు కల్పిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అష్టోత్తర శత కలశాభిషేకాలు చేసి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నృసింహ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


ఇరుముడి సమర్పించదానికి వచ్చిన స్వాములు

ఏపీ ఈఏపీసెట్‌కు 3,61,299 దరఖాస్తులు

- ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849
- ఈ నెల 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహణ
- నేటి నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ : కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్-2025కు ఇప్పటివరకు 3,61,299 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,79,538, అగ్రికల్చర్ ఫార్మసీకి 80,849... రెండింటికీ 912మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. రూ.4 వేలు అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.10వేలు అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లను సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 నెంబరు ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి కేటాయించిన పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్ తెలుసుకునేందుకు హాల్ టికెట్ చివరి పేజీలో గూగుల్ మ్యాప్ ఇచ్చామన్నారు. పరీక్ష కేంద్రం పూర్తి చిరునామాను https://cets.apsche.ap.go v.in/eapcet/EAPCET_Centers.aspx ద్వారా తెలుసుకోవడంతో పాటు గూగుల్ మ్యాప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2359599, 2342499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@ apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సూచించారు.


కన్వీనర్ సుబ్బారావు

175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

మంత్రి వాసంశెట్టి సుభాష్


పి.గన్నవరం హైస్కూల్లో విద్యార్థులకు నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను చూడాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు రాష్ట్రంలో 175 ఇండస్ట్రియల్ పార్క్‌ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. వైసీపీ హయాంలో నిరుద్యోగులను కల్తీ మందు, గంజాయి వైపు మళ్లించి వారి భవిష్యత్తుతో ఆటలాడుకున్నారని, జగన్ మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్, గిడ్డి శ్యామలరాణి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా పి.గన్నవరం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ప్రతీ నియోజక వర్గంలో జాబ్‌మేళాలు ఏర్పాటు చెయ్యడంతో పాటు డీఎస్సీలో 16,450 పోస్టులు భర్తీకి నోటిఫి కేషన్ జారీ చేసిందన్నారు. రాబోయే రెండేళ్లలో 2 నుంచి 3 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. మొదటి విడతగా మే 1న సుమారు 35 నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. ఈక్రమంలోనే కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో రూ.11.05 కోట్లతో ఏర్పాటు చెయ్యనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, హోసూరులలో అప్రెంటిస్‌షిప్ ట్రైనీకి ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందించారు. తొలుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హైస్కూల్ ఆవరణలో ఉన్న సరస్వతిదేవి, వివేకనందుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జాబ్‌మేళాను ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరావు, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, వాసంశెట్టి కుమార్, చొల్లంగి సత్యనారాయణ మూర్తి,నక్కా సత్యనారాయణ తదితరులున్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన భాస్కర్‌రావు

ఎటపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డిపేట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాపురం గ్రామానికి చెందిన అల్లాడి భాస్కర్‌రావు (62) బైక్‌పై టేబుల్ ఫ్యాన్ పెట్టుకుని భద్రాచలం వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో భద్రాచలం నుంచి సీఆర్‌పీఎఫ్ జవాన్లతో చింతూరు వైపు నుంచి వస్తున్న చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో భాస్కర్‌రావుకు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో...


వెంకటరమణ మృతదేహం

కడియం, మే 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం కాలువ గట్టున ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన గుబ్బల వెంకటరమణ (40) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వెంకటరమణ గాలంతో చేపలు పట్టుకుని విక్రయించి జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 10న చేపలు పడుతుండగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లే వారు అతడిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా వెంకటరమణకు ఫిట్స్ వస్తుంటాయని కుటుంబ సభ్యులు తెలిపినట్టు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

ఆలమూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల హైవే పక్కన ఉన్న సైడ్ డివైడర్‌ను ఆదివారం బైక్‌తో ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడుకు చెందిన కొత్తపల్లి ఆనంద్ (30) చిలకలపాడు నుంచి రావులపాలెం వైపు వెళ్తుండగా చొప్పెల్ల లాకుల సమీపంలో అదుపు తప్పి సైడ్ డివైడర్‌ను బలంగా ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందినట్టు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. ఆనంద్ రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భోజనం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా..
ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

గొల్లప్రోలు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం సమీపంలో ట్రాక్టర్ ఢీకొని యువకుడు మరణించాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మత్స్యపురం గ్రామానికి చెందిన కోడా మోహన్ (22) గొల్లప్రోలు మండలం లక్ష్మీపురంలో యాళ్ల వెంకటరమణ చేపల చెరువులో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కూలీలకు భోజనం తెచ్చేందుకు చేబ్రోలు శివారు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని మెస్‌కు బైక్‌పై వెళ్లాడు. భోజనం ప్యాకెట్లు తీసుకుని చేబ్రోలు-ఏకే మల్లవరం రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మోహన్ అక్కడిక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్కంఠభరితంగా...
పిఠాపురంలో తైక్వాండో పోటీలు
పాల్గొన్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


పిఠాపురంలో తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని భాష్యం స్కూలు ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో పోటీలు ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా జరిగాయి. 200 మందికి పైగా క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభను నిరూపించుకునేందుకు పోటీపడ్డారు. ఓవరాల్ చాంపియన్లుగా పిఠాపురం క్రీడాకారులు నిలవగా, రెండోస్థానంలో కాకినాడ, మూడో స్థానంలో అమలాపురం క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు, సభ్యులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, చైతన్య, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. విజేతలను భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజులు, ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు అభినందించారు.


చాంపియన్‌షిప్ గెలుచుకున్న క్రీడాకారులు

జేఎన్టీయూకేలో 'రీసెర్చ్ కాన్‌క్లేవ్' సదస్సు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాగ్నోల్యాబ్స్ సీఈవో యోగేశ్వరరావు

జేఎన్టీయూకే, మే11 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే అలూమ్ని ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ పరిశోధన అభివృద్ధి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రీసెర్చ్ కాన్‌క్లేవ్-2025 సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని కాగ్నో ల్యాబ్స్ సీఈవో డాక్టర్ ఎం.యోగేశ్వరరావు పాల్గొనగా జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ఛైర్మన్‌గా, వర్శిటీ పరిశోధనా అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించగా ప్రిన్సిపాల్స్ మోహన్‌రావు, శ్రీనివాసరావులు కోకన్వీనర్లు, డైరెక్టర్లు ఎ.గోపాలకృష్ణ, ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ సమన్వయకర్తలుగానూ వ్యవహరించారు. యోగేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సుకత నుంచి లక్ష్యంవరకూ పరిశోధనాశక్తి అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రీసెర్చ్‌స్కాలర్స్‌కు అవగాహన కల్పించారు. పరిశోధనా విభాగానికి సంబంధించి పేపర్ ప్రజంటేషన్‌లో 2017, 2022లో ప్రపంచవ్యాప్తంగా చైనా, అమెరికా దేశాలు మొదటి, రెండు స్థానాల్లో ఉండగా 1,91,590 పేపర్లతో భారతదేశం 4వస్థానంలో నిలిచిందని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ వర్శిటీలో త్వరలో రీసెర్చ్‌స్కాలర్స్‌కు కేంద్రీకృత పరిశోధన, లైబ్రరీ సదుపాయం, మౌలిక వసతుల కల్పన, మ్యాట్ ల్యాబ్ కల్పిస్తామన్నారు. రీసెర్చ్ కాన్‌క్లేవ్‌కు 210మంది హాజరుకాగా వారిలో 110 మంది పోస్టర్ ప్రజంటేషన్ ఇవ్వడం జరిగిందని డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ ఉప కులపతులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

ఏపీ జెన్కో హైడల్ చీఫ్ ఇంజనీర్ పర్యటన

మోతుగూడెం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ సివిల్ (హైడల్)గా ఉద్యో గోన్నతి పొందిన రవీందర్‌రెడ్డి ఆదివారం తొలిసారిగా లోయర్ సీలేరు పరిధిలోని పొల్లూరు, డొంకరాయి ప్రాజెక్టులను సందర్శించారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ నూతనంగా చేపట్టిన 5, 6 యూనిట్ల పనులను పరిశీలించారు. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల పొడవున్న పవర్ కెనాల్‌ను పరిశీలిస్తూ డొంకరాయి ప్రధాన ఆనకట్టకు చేరుకున్నారు. డొంకరాయి ఏపీ జెన్‌కో అధికారులు రవీందర్ రెడ్డికి సాదర స్వాగతం పలికారు. ప్రధాన ఆనకట్ట, 25మెగావాట్ల మినీ పవర్‌హౌస్, శాండిల్ పికప్ డ్యాములను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పర్యటనలో ఎం.శేఖర్ (ఎస్ఈ సివిల్, విద్యుత్ సౌధ విజయవాడ), లోయర్ సీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, డొంకరాయి జెన్‌కో అధికారులు, ఏఈలు శివశంకర్, విజయ్‌పాల్, మురళీకృష్ణ ఉన్నారు.


పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


కొవ్వూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన తిగిరిపల్లి విద్యాసాగర్(18)ఆదివారం బైక్‌పై కాపవరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎస్‌టర్నింగ్ వద్ద పంగిడి వైపు వెళ్తున్న గడ్డిట్రాక్టర్ ఢీకొంది. విద్యాసాగర్ బైక్‌పై నుంచి కింద పడి తల, నడుముకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అరవిందకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్టు తెలిపారు.


ట్రాక్టర్ చక్రాల కింద ఉన్న బైక్

పెళ్లి కబుర్లకు బయలుదేరి..
ట్రాలీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కబుర్లకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన 16వ నెంబరు జాతీయ రహదారి కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో జరిగింది. తుని రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. బూరాడ రాంబాబు (38) తన అన్నయ్య కుమార్తె పెళ్లి కబుర్లు చెప్పేందుకు విజయవాడ రాణిగారి తోట ఏరియా నుంచి శ్రీకాకుళం జిల్లా రామన్నపేటకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. తేటగుంట చేరుకునేసరికి వెనుక నుంచి రాంబాబు ద్విచక్రవాహనాన్ని ట్రాలీ లారీ బలంగా ఢీకొని ద్విచక్రవాహనంతో 200మీటర్లు లాక్కుని వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పక్కనే ఉన్న కెమెరాల ఆధారంగా ప్రమాదానికి గల కారణాన్ని అన్వేషించి లారీని పట్టుకుని కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విజయవాడలో క్యాటరింగ్ పనులు నిర్వహిస్తూ జీవన ఉపాధి పొందుతున్నట్టు, పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐకృష్ణమాచార్యులు చెప్పారు.


రాంబాబు (ఫైల్‌ఫొటో)


ప్రమాదంలో నుజ్జునుజ్జుఅయిన ద్విచక్రవాహనం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గ్రంథాలయానికి వాటర్ కూలర్ బహూకరణ

పెద్దాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి జిగిని రాజేష్ ఖన్నా వాటర్ కూలర్ బహూకరించినట్టు గ్రంథాలయ పాలకుడు పాలంకి నాగరాజు తెలిపారు. పాఠకులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.



పెద్దాపురప్పాడులో గంగమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నానాజీ

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కరప, మే 11 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడు గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. మూడు రోజుల ఉత్సవంలో భాగంగా తొలి రోజైన ఆదివారం ఉదయం గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ ప్రతిరూపం గోవతాళ్ల బుట్టను కిందకు దింపి నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గుడి ప్రాంగణంలోని చలువ పందిళ్ల కింద వందలాది మంది గొల్లలు తప్పెటగుళ్లు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, కౌడా చైర్మన్ తుమ్మల బాబు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమ, మంగళవారాల్లో భక్తుల రద్దీ పెరగనున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాట్లు చేసినట్టు గొల్లపల్లి వంశీయులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సహృదయ మిత్రమండలి సభ్యులు, విద్యార్థులు

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సరిహద్దుల్లో జరిగిన సంఘటనల్లో వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్‌కు సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనారావు సభా సదన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మిత్రమండలి ప్రతినిధులు, శిక్షణ పొందుతున్న విద్యార్థులు మురళీనాయక్ చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి అంజలి ఘటించారు. మిత్రమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసరావు, సీహెచ్ సతీష్, ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాస్, కేవీవీఎస్ ప్రసాద్, కొమ్మనాపల్లి అప్పారావు, పావని, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఉద్యోగ ఎంపిక పత్రం అందజేస్తున్న పైడా కళాశాల కార్యదర్శి సత్యశ్రీరామ్

పైడా కళాశాలలో ప్లేస్‌మెంట్ డే

కాకినాడ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పైడా కళాశాలలో ఆదివారం ప్లేస్‌మెంట్ డే నిర్వహించారు. కళాశాల నుంచి ఈ ఏడాది మొత్తం 565 మంది విద్యార్థులు ఐబీఎం, వర్చ్యూసా, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని, వారి తల్లిదండ్రులను పైడా కళాశాల చైర్మన్ పి.సత్యప్రసాద్, కార్యదర్శి సత్యశ్రీరామ్, సంయుక్త కార్యదర్శి నిత్యాశ్రీరామ్ ఆదివారం ఘనంగా సత్కరించారు. డీన్ డాక్టర్ వీరభద్రరావు, డీడీ రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ సూర్యప్రకాష్, కేశవరావు, సురేష్, పాపయ్యరాజు, రవికుమార్, వంశీకృష్ణ, సుమ తదితరులు పాల్గొన్నారు.



బీపీ టెస్ట్ చేయించుకుంటున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

పిఠాపురంలో మెగా వైద్య శిబిరం

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారామ్మోహనరాయ్ పార్కు ఆవరణలో ఆదివారం జనసేవా సంఘం, జేజీఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 300మందికి పైగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు రక్త, ఎముకల సాంద్రత, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. జనసేవా సంఘం వ్యవస్థాపకుడు కరణం సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జేజీఆర్ ఆసుపత్రి వైద్యులు జోగా గనిరాజు, వెంకటరమణ, జనసేవా సంఘం అధినేత కరణం సూరిబాబు, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో విజయ ఆర్థోకేర్ ఆసుపత్రి, శాన్విత స్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గంగాధర్, జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు, బాలిపల్లి రాంబాబు, సూరవరపు సురేష్, బండి రవి, కావడి పోశయ్య, పోలిశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్లు... ఆరోగ్యానికి తూట్లు

గొర్రిపూడి అంగన్వాడీ కేంద్రం నిర్వాహకుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

కరప, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రిపూడి మార్కెట్ వీధిలో గల అంగన్వాడీ కేంద్రం నిర్వాహకుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం నుంచి ఈనెల 7వ తేదీన సరఫరా అయిన కోడిగుడ్లు నాసిరకంగా ఉండడంతో పాటు ఉడకబెడితే కుళ్లిపోయి దుర్వాసన వచ్చాయని వారు ఆరోపించారు. ఇటువంటి గుడ్లను తింటే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లు



గొర్రిపూడి అంగన్వాడీ కేంద్రానికి సరఫరా చేసిన కుళ్లిన కోడి గుడ్లు

నాసిరకంగా ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గుడ్లను సరఫరా చేసే ఏజెన్సీపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పద్మశాలీ కల్యాణ మండపం నిర్మాణానికి పూర్తి సహకారం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు. చిత్రంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కల్యాణ మండపం నిర్మాణానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. భాస్కర్ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద పద్మశాలీలకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం ఆయన కాకినాడ పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షుడు వింజమూరి వెంకట సుబ్బారావు (చినబాబు) అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ 25 సంవత్సరాల కల సాకారమవ్వడం శుభపరిణామమన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా నిర్మించాలన్నారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ దీని నిర్మాణానికి జనసేన తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రిని పూర్తి సహకారం అందించాలని కోరతామన్నారు. ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ విచ్చేశారు. కార్యక్రమాన్ని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్, సంఘ న్యాయ సలహాదారుడు జగ్గారపు మల్లికార్జున పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కాకినాడ సూపర్‌బజార్ చైర్మన్ గ్రెసింగి ఆదినారాయణ, అవిఘ్న ల్యాండ్ డెవలపర్స్ అధినేత జాగు రామకృష్ణ, పద్మశాలీ సంఘ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు, కోశాధికారి వల్లభదాసు శివాజీగణేష్, పద్మశాలీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేతా సత్యనారాయణ, సూరిశెట్టి జయకృష్ణ, పొన్నగంటి సత్యనారాయణ, కడారి భవానిమధు, చిల్లపల్లి గణపతి, పప్పు రాజారావు, కొప్పుల రాజ్‌కుమార్, గదుల సాయిబాబు, గుత్తుల రమణ, ఎంఏ తాజుద్దీన్, కొక్కిలిగడ్డ గంగాధర్, చోడిపల్లి సతీష్, పలివెల లక్ష్మీరాజ్, కాదా సరోజని, పచ్చారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు బస్ స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు

గొల్లప్రోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండుల్లో తనిఖీలు జరిపి ప్రయాణికుల బ్యాగేజీలను పరిశీలించారు. ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా కృష్ణకుమారి

కాకినాడ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. దీంతో కార్యాలయ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి.కృష్ణకుమారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కరప, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజనాపల్లి గ్రామ శివారున పేకాట శిబిరంపై ఆదివారం కరప ఎస్ఐ తోట సునీత సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,730 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు.



గైనకాలజిస్టు డాక్టర్ శ్రీలతను సత్కరిస్తున్న మహిళలు

ఘనంగా మదర్స్ డే

పిఠాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం అధ్యక్షుడు పి.విజయజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీలతను మహిళలు సత్కరించారు.

సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సమస్యలపై రేపు 'దశ-దిశ' చర్చ

కాకినాడ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సమస్యలపై మంగళవారం ఉదయం 10 గంటలకు ఆనందభారతి గ్రౌండ్ జిమ్ భవనం హాలులో దశ-దిశ చర్చ ఏర్పాటు చేసినట్లు కాకినాడ జిల్లా సౌండ్ సిస్టమ్ ఓనర్స్, హెల్పర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడికట్ల లోవరాజు తెలిపారు. ఆదివారం ఆయన రెవెన్యూ కాలనీలో మీడియాతో మాట్లాడుతూ ఓనర్స్, హెల్పర్స్ సమస్యలు, రేటు కాపాడుకోవడంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సౌండ్ సిస్టమ్ ఫీల్డ్‌కు సంబంధించిన వారు తప్పకుండా ఇన్సూరెన్స్ పాలసీ కలిగి ఉండేలా కార్యాచరణ చేపట్టామన్నారు. అవసరమైన వారు సమావేశం వద్ద ఏర్పాటుచేసే ప్రత్యేక కౌంటర్లో పాలసీ నమోదు చేయించుకోవచ్చన్నారు. నామమాత్ర రుసుం పోస్టాఫీసులో చెల్లించాలని, ఆధార్ కార్డుతో పాటు నామినీగా కుటుంబంలో ఒకరి ఆధార్ కార్డు తెచ్చుకోవాలన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ.10 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

కరపలో చైన్ స్నాచింగ్

బాలిక మెడలోని బంగారు గొలుసు అపహరణ

కరప, మే 11 (ఆంధ్రజ్యోతి): కరపలో ఆదివారం ఒక బాలిక మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... కాకినాడలో ఉంటున్న నక్కా లక్ష్మీఅలేఖ్య ఆదివారం



బాధితులను విచారిస్తున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ

ఉదయం 12 ఏళ్ల తన కుమార్తె హాసికను స్కూటీపై ఎక్కించుకుని జడ్.బావారంలోని అత్తగారింటికి బయల్దేరింది. కరప మిత్ర గార్డెన్ దాటిన తర్వాత డంపింగ్ యార్డ్ వద్దకు వచ్చేసరికి ఒక వ్యక్తి బైక్‌పై వచ్చి స్కూటీ వెనుక కూర్చున్న ఆమె కుమార్తె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసును లాక్కుని వేగంగా వెళ్లిపోయాడు. ఈ హఠాత్పరిణామంతో భీతిల్లిన తల్లీకూతుర్లు వెంటనే తేరుకుని కరప ఎస్‌బీఐ బ్రాంచి వరకు వెంబడించినా నిందితుడి ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ సునీత సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. చైన్ స్నాచింగ్ జరిగిన ప్రదేశం నుంచి కాకినాడ వెళ్లే మార్గంలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా చైన్ స్నాచర్ మొదట్నుంచీ వారిని వెంబడిస్తున్నట్టు నిర్ధారణ అయ్యింది. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ తల్లీకూతుర్లను విచారించి వివరాలు నమోదు చేశారు. నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గొల్లప్రోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు వై.జంక్షన్ సమీపంలో 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. తునికి చెందిన మంగిన వీర్రాజు, పుచ్చకాయల వెంకటరమణ మోటారు సైకిలుపై పిఠాపురం వస్తున్నారు. అదే సమయంలో గొల్లప్రోలుకి చెందిన గొంతిరెడ్డి భీముడు సైకిలుపై వస్తుండగా మోటారు సైకిలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ముగ్గురినీ పిఠాపురంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు హైవే అంబులెన్సులో తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నమో నమః భారత్ ఆకారంలో పూజలు నిర్వహించిన దృశ్యం

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సూర్య భగవానుడికి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. దేశం తర్వాతే ఏదైనా అంటూ నమో నమః భారత్ అంటూ సూర్యనమస్కారాలు, భారతదేశ చిత్రపటంతో సూర్య యంత్రంతో నమస్కారాలు చేశారు. ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీఈటీ సంఘం కార్యదర్శి, కోశాధికారి పదవులు ఏకగ్రీవం

కార్పొరేషన్ (కాకినాడ), మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఎన్నికల్లో కార్యదర్శి, కోశాధికారి పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అధ్యక్ష పదవికి ఇద్దరి మధ్య గట్టి పోటీ నెలకొంది. 2025-27కు నూతన కార్యవర్గ ఏర్పాటులో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈ నెల 9వ తేదీతో ముగిసింది. అధ్యక్ష పదవికి ముగ్గురు నామినేషన్ వేశారు. అధ్యక్ష అభ్యర్థి ఎం.హరిబాబు, కార్యదర్శి అభ్యర్థి నరసింహమూర్తి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఎవరూ పోటీ లేకపోవడంతో కార్యదర్శిగా వి.మాచరరావు, కోశాధికారిగా కె.నాగేలింగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి వి.రవిరాజ్ తెలిపారు. అధ్యక్ష పదవికి ఈ నెల 17వ తేదీ ఉదయం పది నుంచి రెండు గంటల వరకు ఎన్నిక జరుగుతుందని చెప్పారు.

అక్రమ అరెస్టులు సరికాదు

మాజీ ఎంపీ వంగా గీత

కార్పొరేషన్ (కాకినాడ), మే 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని, మహిళల ఆత్మగౌరవం కాపాడతామని చెప్పే కూటమి నాయకులు ఏమైపోయారని మాజీ ఎంపీ వంగా గీత మండిపడ్డారు. కాకినాడలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళ మాజీ మంత్రి అని కూడా చూడకుండా పోలీసులు చేయిచేసుకోవడం దారుణమని. ఎంపీటీసీ కల్యాణ్‌పై కూడా దురుసుగా ప్రవర్తించారన్నారు. వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్ములమడుగు నాగమణి, జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, సంయుక్త కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సూర్య భగవానుడికి అర్చకులు చెరుకూరి వీర బాబు, దత్తు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. దేశం తర్వాతే ఏదైనా అంటూ నమో నమః భారత్ అం టూ సూర్యనమస్కారాలు, భారతదేశ చిత్రపటంతో సూర్య యంత్రంతో నమస్కారాలు చేశారు. ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పోలీసుల తనిఖీలు

గొల్లప్రోలు, మే 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, బస్టాండుల్లో తనిఖీలు జరిపి ప్రయాణికుల బ్యాగేజీలను పరిశీలించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'ఎస్సీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి'

రంపచోడవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): 1950 పూర్వం నుంచీ ఏజెన్సీ ప్రాంతంలో నివాసముం టున్న ఎస్సీలకు 1986 వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవని, ఆతర్వాత అందట్లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదే రామచంద్రరావు అన్నారు. నివాసస్థలాల కేటాయింపు, ఉద్యోగ కల్పన జరగట్లేదన్నారు. ఐటీడీఏ, సబ్ కలె క్టర్ కార్యాలయాల్లో ఎస్సీలకు ప్రత్యేక గ్రీ వెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకమే

● అధ్వానంగా పలు గ్రామాల రహదారులు



వెట్‌మిక్స్ నిర్మాణంతో ఉన్న గోగుబాక ప్రధాన రహదారి

ఎటపాక, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలం లో అనేకచోట్ల రహదారులు అధ్వానంగా మార డంతో వాహనదారులు, బాటసారులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రహదారులపై ప్రయాణమంటే బెంబేలెత్తి పోతున్నారు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధు లతో డబుల్ బీఎం రహదారులు మంజూ రయ్యాయి. సుమారు గత పదేళ్ల క్రితం కాపవరం నుంచి గోగుబాక వరకు సు మారు కిలోమీటర్‌పైనే బీటీ రహదారి నిర్మా ణం కోసం వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రా క్టర్ రహదా రి నిర్మాణంను పూర్తిచేయలేదు. దాంతో అప్పటి నుంచి ఈ రహదారి వెట్‌మిక్స్ నిర్మాణంతో అసంపూర్తిగా ఉంది. ఈ రహదా రిపై వాహనదారులు, బాటసా రులు ప్రయాణం చేయాలంటే నరకంగా మారిందని చెబుతున్నారు. పండు వారిగూడెం నుంచి రాంగోపాలపురం మధ్యలో గతంలో వెట్‌మిక్స్ నిర్మాణంచేసి, రహదారి వదిలేశారు. దాంతో ఆ రహదారి అధ్వానంగా ఉంది. జిన్నెల గూడెం, కన్నాయిగూడెం పంచాయతీలోని సత్యనారాయణపురం గ్రామంలోని రహదా రులు కాలినడకన వెళ్లేం దుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఈ గ్రామాలకు రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మే 11(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని పొల్లూరులో సాయి బాబా ఆలయ 32వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ప్రధానార్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ ఆధ్వర్యంలో సాయిబాబాకు పం చామృతాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసంతర్పణ జరిగింది. అనంతరం పొల్లూ రు, మల్లవరం గ్రామస్తులకు, నిరుపేదలకు ము సలివాళ్లు సుమారు 80 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ (డీఈటీ) వరప్రసాద్, సీని యర్ అక్కౌం ట్సు ఆఫీసర్ వరప్రసాద్ కొండ బాబు (ఏడీఈ సివిల్) పవన్ (ఏఈ స్టోర్స్), శ్రీదుర్గా మల్లేశ్వర దేవస్థానం కమిటీ సభ్యులు సతీష్ రాఘవన్, ఎం.శివరామకృష్ణ, పేపకా యల శ్రీను, గోవిందరాజు రమేష్, నాని, జెమిని పాల్గొన్నారు.

పాపికొండలకు 500 మంది పర్యాటకులు



పర్యాటకులతో సందడిగా మారిన పోచవరం పెర్రీ పాయింట్

వీఆర్‌పురం, మే 11(ఆంధ్రజ్యోతి) పాపికొండలు పేరంటాలపల్లి విహార యాత్రకు ఆదివారం 500మంది పర్యాటకులు వచ్చారు. ఆంధ్రా, తెల ంగాణ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతరరాష్ట్రాల నుంచి పర్యాటకులు పాపికొండలు, పేరంటా లపల్లి విహార యాత్రకు వస్తున్నారు. పోచవరం పెర్రి పాయింట్ నుంచి ఆది వారం 5 బోట్లలో పర్యాటకులు పాపి కొండల్లోని అందాలను, పేరంటాలపల్లి లోని ముని మఠాన్ని (శివాలయం) దర్శించు కున్నారు. దీంతో ఆయా పర్యాటక ప్రా ంతాలలో పర్యాటకు లతో సందడి వాతావరణం నెలకొంది. ఆప్రాంతంలోని కొండరెడ్లు వెదురుతో అందంగా తయారు చేసిన అల్లికలను ఖరీదు చేయడంతో అక్కడ కొండరెడ్లకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. అలాగే పర్యాటకులు గండి పోశమ్మ అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం'

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడి శెట్టి రాజా ఆరోపించారు. ఎస్.అన్నవరం గ్రామంలో తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలను ధ్వంసం చేయడంలో కీలక పాత్ర వహిస్తున్న మహిళలను ప్రపంచం ప్రశంసి స్తుంటే రాష్ట్రంలో మహిళల గౌరవానికి భంగం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోన్న పోలీసులు తీరు దారుణమన్నారు. ఆయన వెంట స్థానిక వైసీపీ నాయకులు ఉన్నారు.

'అక్రమ కేసుల్లో వేధిస్తున్నారు'

ప్రత్తిపాడు, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని నర్సా పురం పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ పరిశీల కుడు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆరోపించారు. ఉత్తరకంచి, ధర్మవరం, శరభవరం, పెదశంకర్ల పూడి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటిం చారు. పార్టీ నాయకులు, అభిమానులను కలు సుకున్నారు. ఈసందర్భంగా ముదునూరి మాట్లాడుతూ విపక్ష నాయకులపై అక్రమ కేసు లు వేధింపులు మానుకోవాలని మురళీరాజు డిమాండ్ చేశారు.



1995-96 సంవత్సరం టెన్త్ బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రౌతులపూడి, మే 11(ఆంధ్రజ్యోతి): మూలగ పూడి జిల్లా పరిషత్ హైస్కూల్ 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనా నికి విచ్చేశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

ఆంజనేయస్వామి మాలధారణ దీక్షలు

గండేపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి జాతీయ రహదారి పక్కనున్న అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం పురో హితులు చింతా అరుణ్ కుమార్‌శర్మ వేదమంత్రాల నడుమ గ్రామానికి చెందిన 15మంది భక్తులు ఆంజనేయ స్వామి మాలాధారణ దీక్షలు స్వీకరించారు. 11రోజుల దీక్ష చేపట్టిన స్వాములు రోజూ స్వామి వారికి ప్రత్యేక్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో దార్లంక శ్రీనివాసు, జాజిమొగ్గల సత్యనారాయణ, అక్కి రెడ్డి సత్తి బాబు, తెమ్మనబోయిన జయ, వల్ల భట్టి చక్రి పాల్గొన్నారు.



మాలాదరణ దీక్షలు తీసుకుంటున్న భక్తులు



ప్రత్తిపాడు ఆసుపత్రిలో కోలుకుంటున్న పాముకాటు బాధితుడు

మృత్యుంజయుడు

ప్రత్తిపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): పొలం లో రైతును విషసర్పం రక్త పొడ కాటేసింది.. 15రక్తం వాంతులయ్యాయి.. పరిస్థితి విషమిం చింది.. సకాలంలో ఆసుపత్రికి తీసుకు వెళ్లడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. చింతలూరుకు చెందిన రైతు గోదారి సురేష్ శనివారం సాయంత్రం పొలంలో చేనుకు పురుగు మందు పిచికారి చేస్తుండగా విష సర్పం రక్తపొడ కాటువేసింది. దీంతో సురేష్ కు రక్తం వాంతులు అయ్యాయి. వెంటనే అతడు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. బంధువులు అతడ్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య బృందం బాధితుడికి వైద్యం అందించారు. అయినా అతడి పరిస్థితి మరింత విషమంగా ఉంది. 25ఇంజక్షన్లు ఇచ్చి 24గంటలు బాధితుడికి వైద్య సేవలు అందించారు. ఆదివారం సాయంత్రానికి సురేష్ పరిస్థితి మెరుగుపడిందని సూపరిం టిండెంట్ సౌమ్య తెలిపారు. 15రక్తం వాంతులై పరిస్థితి విషమించినా అర గంట వ్యవధిలో ఆసుపత్రికి తీసుకు రావడంతో అతడ్ని కాపాడామని సౌమ్య తెలిపారు.



దాహార్తి తీర్చుకుంటున్న పశువులు

ప్రభుత్వం నిర్ణయంపై రైతుల హర్షం

కిర్లంపూడి, మే 11(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగేందుకు నీరు లేక మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు చెరువులు, పంట కాలువలు, బావులు ఎండిపోతుంటాయి. వేసవిలో పాడి పశువులకు నీరు పెట్టేందుకు అన్నదాతలకు కష్టంగా ఉంటుంది. ఈనేపథ్యంలో గోవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, ఇతర పశు పక్ష్యాదు లకు నీరు అందుబాటులో ఉంచేందుకు నీటి తొట్టెల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉపాధి హామీ పథకంలో భాగం గా పలు గ్రామాల్లో మూగజీవాల కోసం నీటి తొట్టెలను నిర్మిస్తున్నారు. 515 మీటర్ల పొడవు 2.15వెడల్పుతో రూ.35 వేలతో ఉపాధి నిధు లతో తొట్టెలను నిర్మిస్తున్నారు. ఒక్కో తొట్టెలో 6వేల లీటర్ల నీరు నిల్వ ఉండేలా నిర్మాణం చేపడుతున్నట్లు ఏపీవో నాయుడు, జేఈ కుమారి తెలిపారు. మండలానికి 15 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. వీటిలోభూపాల పట్నం, ఎస్.తిమ్మాపురం, రాజుపాలెం, వీరవ రం గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం పూర్త యింది. మిగతా 11 నిర్మాణ దశలో ఉన్నాయి.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కరప, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గురజనా పల్లి గ్రామ శివారున పేకాట శిబిరంపై ఆదివారం కరప ఎస్ఐ తోట సునీత సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకా డుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,730 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితు లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



రోడ్డుపై గుంతలు చూపిస్తున్న గ్రామస్తులు

గుంతలు పూడ్చాలంటూ గ్రామస్తుల ఆందోళన

కిర్లంపూడి, మే 11(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం నుంచి వీరవరం వెళ్లే ప్రధాన రహదారిలో రెండు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈర హదారిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజుపాలెం, వీరవరం, రామచంద్ర పురం, కిర్లంపూడి, గోనేడ, తామరాడ, గ్రామాల ప్రజలు ఈరహదారిలో రాకపో కలు సాగిస్తున్నారు. ఈరహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడు తున్నామని వీరవరానికి చెందిన ఉరదాసు వెంకటేష్ పలువురు నిరసన చేపట్టారు. ఆర్అండ్‌బీ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం శూన్య మన్నారు. రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వెంకటేష్, పిడుగు జయ బాబు, పులి రంగా, ధూలపల్లి వెంకటరమణ, మడె లక్ష్మణ్, కందిమళ చినబాబు, ఉరదాసు గణేష్, ఉండ్రాసు రామకృష్ణ డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి అర్జునరావు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ఏలేశ్వరం, మే 11(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న లేబర్ కోర్టు బిల్లును అమలు చేయడానికి వీల్లేదన్నారు. కార్మికుల విరమణ ఒప్పందాన్ని దేశ ప్రజలందరూ స్వాగతిస్తారన్నారు. రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, గుర్రం వీరబాబు, నాగమణి పాల్గొన్నారు.

లోవలో భక్తుల కోలాహలం

• వాహనాలతో కిక్కిరిసిన ఘాట్ రోడ్లు • ఆలయానికి రూ.3.64లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి ఆదివారం వేకువజాము నుంచే తె లుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. ఆలయ ఈవో పి.విశ్వనాధరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా రూ.3.64లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. తుని రూరల్ సీఐ ఆధ్వర్యం లో రూరల్ పోలీసులు ప్రత్యేక బం దో బస్తు ఏర్పాటు చేశారు. వాహ నాల రాకపోక లకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఘాట్ రోడ్లు వాహనాలతో కిక్కిరిశాయి.

రథోత్సవానికి తరలివెళ్లిన భక్తులు



ధర్మవరం నుంచి అన్నవరం రథోత్సవానికి వెళుతున్న భక్తులు

ప్రత్తిపాడు, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తి పాడు పరిసర గ్రామాల నుంచి ఆదివారం సత్యదేవుని రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. అన్నవరం సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవానికి ప్రత్తి పాడు, ధర్మవరం, కిర్లంపూడి, చిల్లంగి, బూరు గుపూడి, మల్లవరం, ఇరుపాక తదితర గ్రామాల నుంచి భక్తులను సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు అన్నవరం తరలివెళ్లా రు. తరలివెళ్లిన భక్తుల్లో చలకమర్తి దుర్గాభ వాని, డోలు వెంకటలక్ష్మి, ఆర్.శతలక్ష్మి, లలిత కుమారి, బొల్లెమ్మ, రమణమ్మ, వరలక్ష్మి, లోవ మ్మ, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.



ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ఏలేశ్వరం, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. డ్రాయింగ్, కథలు, పద్యాలు తదితర అంశాలపై విద్యా ర్థులకు ఉపాధ్యాయుడు మామిడి రాము శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకు డు కవికొండ సత్యనారాయణ కోరారు.



కత్తిపూడి నెల్లిపూడి సమీపంలో ఆహ్లాదాన్ని ఇస్తున్న చెట్లు

చల్లగా... హాయిగా

శంఖవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో ఈదారిలో ప్రయాణం చల్లగా ఉంటుంది. అలుపులేకుండా ఆహ్లాదంగా సాగిపో తుంది. ఇదంతా చెట్ల చలవే... రహదారికి ఇరువైపులా చెట్లు నాటడం... వాటిని పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇప్పుడు అనుభవంలోకి వస్తున్నాయి. శంఖవరం మండలంలో ఇలాంటి రోడ్లు చాలా తక్కువగా ఉంటాయి. ఈ దారిలో ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుందని వాహనదారులు అంటున్నారు. కత్తిపూడి నుంచి శంఖ వరం వైపుగా వెళితే ఈ అనుభూతిని పొందవచ్చు.



హోమం నిర్వహిస్తున్న రమేష్ తదితరులు

ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా హోమాలు

కిర్లంపూడి, మే 11(ఆంధ్రజ్యోతి): భార త్-పాక్ యుద్ధం నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మల పల్లి సాయిగుణ శేఖర్ పర్యవేక్షణలో గ్రామంలోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం, సుదర్శన హోమం నిర్వ హించారు. కార్యక్రమంలో జనసేన నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లి వేడుకల్లో తుమ్మల

జగ్గంపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): రామ వరం గ్రామానికి చెందిన మండపాక వెంక టేశ్వరులు కుమారుడు శశి వివాహానికి, అడపా దుర్గారావు కుమారుడు, జనసైని కుడు మండల కార్యదర్శి అడపా రాం బాబు వివాహానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యా రు. ఆయన వెంట మొగిలి గంగాధర్, ముమ్మన వేణుగోపాల్, కొమ్మిరెడ్డి లోవ, చాటల సత్తిపండు, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, రేపూరి శ్రీను, కోల మూరి బుజ్జి, అడబాల వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

పెద్దాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి జిగిని రాజేష్ ఖన్నా వాటర్ కూలర్ బహూకరించినట్టు గ్రంథాలయ పాలకుడు పాలంకి నాగరాజు తెలిపారు. పాఠకులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.